@netifocusnews @focustv www.netifocusnews.com

TS-18-0006625

FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం


నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | మంగళవారం 26, డిసెంబర్ 2023 | పేజీలు: 04




## సింగరేణిలో ముగిసిన ప్రచారం

- చివరిరోజు మంత్రుల పర్యటన
- సిపిఐ తరపున కూనంనేని ప్రచారం

వివరాలు 03లో..

# చాపకింద నీరులా
# కోవిడ్ వ్యాప్తి

## కొత్తగా 628 కరోనా కేసులు నమోదు

- ఆదివారం కరోనాతో ఒకరు మృతి
- కేరళలో పెరుగుతున్న కేసుల సంఖ్య
- భూపాలపల్లిలో ఒకే కుటుంబంలో ఆరుగురికి కరోనా
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/న్యూఢిల్లీ-డిసెంబర్25:

దేశంలో కరోనా చాప కింద నీరులా విస్తరిస్తోంది. దేశవ్యాప్తంగా కరోనా యాక్టివ్ కేసులు 4 వేల మార్కును దాటాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 628 కరోనా కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల మేరకు, ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ 312 యాక్టివ్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742 నుంచి 4,054కు పెరిగింది. తాజా కేసుల్లో ఒక్క కేరళలోనే 128 కేసులు వెలుగుచూశాయి. ఆదివారం కరోనాతో ఒకరు మృతి చెందారు. దీంతో కొవిడ్ తో మృతి చెందిన వారి సంఖ్య 5,33,334కు చేరింది. దీంతో మొత్తం మిగతా 2లో..



## పౌరసరఫరాలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 03లో..

## మాట తప్పడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉంది

- హామీల అమలులో కాంగ్రెస్ వెనుకంజ
- ఎమ్మెల్సీ కవిత విమర్శలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్25:

మాట తప్పడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ప్రస్తుతం ఆ పార్టీ అయోమయంలో ఉందని, ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. హిజాబ్ వివాదానికి సంబంధించి సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత మిగతా 2లో..



## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్

- ప్రధాని మోడీతో సమావేశం అయ్యే ఛాన్స్
- రేంవత్‌ను కలిసిన మంత్రి కోమటిరెడ్డి



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్25:

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ మేరకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి సంబంధించిన మిగతా 2లో..

నిత్య నూతనంగా వెలువడుతూ..

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.

9848488596

FOCUS TV TELUGU

## దేశవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ సంబరాలు

- చర్చిల్లో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, రాష్ట్రపతి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్25:

దేశ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. చర్చిలన్నీ పండగ కళను సంతరించుకున్నాయి. భక్తులంతా అర్ధరాత్రి నుంచే వేడుకల్లో పాల్గొన్నారు. ఢిల్లీతో సమా కేరళలో పండగను ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కర్ణాటకలోని బెంగళూరులో అన్ని చర్చిల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పుదుచ్చేరిలో పెద్ద ఎత్తున భక్తులు చర్చిలకు తరలివచ్చారు. హిమాచల్ ప్రదేశ్ ధర్మశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానికులతో పాటు.. విదేశీయులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉండేలా ఏసు ప్రభువు దీవించాలని అన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. మిగతా 2లో..





# వాజ్ పేయి జయంతి సందర్భంగా బీజేవైమ్ ఆధ్వర్యంలో అన్నదానం

మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 25:

భారతీయ జనతా యువ మోర్చా మిర్యాలగూడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ లో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయి 99వ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిల్లంచర్ల అభి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చిరకాలం గుర్తుండిపోయే ఉత్తమ పార్లమెంటన్ మాజీ ప్రధాని వాజ్ పేయి గారు అని, మారుమూల గ్రామాలకు సైతం ప్రధాని సడక్ యోజన కార్యక్రమం ద్వారా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసిన స్వర్ణ చతుర్భుజి కార్యక్రమం తో దేశ ఆర్థిక వ్యవస్థను పట్టుకొమ్మ లాంటి మహానగరాలు రూపుదిద్దుకున్నాయని ఇది ఆయన ముందుచూపు వలనే సాధ్యమైంది అని జై జవాన్ జై కిసాన్ జై విజ్ఞానని శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు, భారతరత్న వాజ్ పేయి గారు అని, జమ్ము కాశ్మీర్ విషయంలోనూ కార్గిల్ యుద్ధం సమయంలోను ఆయన సమయస్ఫూర్తి నేడు దేశానికి మార్గదర్శమయ్యాయని ప్రస్తుత రాజకీయాలకు గొప్ప మార్గదర్శని ఆయన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదినేని శ్రీనివాస్ రావు పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న యువ మోర్చా నాయకులను అభినందించారు అలాగే ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు చిలుకూరు శ్యామ్, బంటుగిరి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదమాం వెంకన్న, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పెదమాం భరత్, పట్టణ ఉపాధ్యక్షులు మోదల అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి మేడి నవీన్, బీజేవైఎం నాయకులు ఇరుగు దిండ్ల నరేష్, రావుల నరేష్, బంటు మధు, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల హక్కులు కాపాడాలి

తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 25:

వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని డీసీఐసీ జిల్లా కన్వీనర్ వింజమూరి సుధాకర్ అన్నారు. వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల పై డివిజన్ కేంద్రంలోని యతిరాజరావు పార్కులో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు 1986లో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని 2019లో మార్పులు చేసి, వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దు అన్నారు. ఇలాంటి మోసాలను హ్యాకర్లు గుర్తించి దోచేస్తారని, పాస్‌వర్డులను సులువుగా పెట్టుకోవద్దని, ఓటీపీలను ఇతరులతో పంచు కోవద్దన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ, కస్టమర్ కేర్ నంబరు సరి చూసుకోవాలని సూచించారు. డిజిటల్ పేమెంట్, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్ ద్వారా చెల్లింపులు జరిపే ముందు వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తప్పకుండా రశీదు పొందాలని సూచించారు. మోసానికి గురైతే కన్జ్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జానీ, మైస శ్రీనివాస్, విష్ణువర్ధన్, పట్టాభి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు
- సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనంద రావు

(నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 25,మాగి ముఖేష్,బోనకల్ ప్రతినిధి:

బోనకల్ దేశ స్వాతంత్రం కోసం, తాడిత,పీడిత ప్రజల అభివృద్ధి కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 98 వసంతాలు పూర్తిచేసుకుని 99వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనంద రావు పిలుపునిచ్చారు. సోమవారం ముష్టికుంట్ల గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మనిషిని మనిషి దోపిడి చేయని సమసమాజ నిర్మాణంకోసం ఆవిర్భవించిన సిపిఐ నాటి నుంచి నేటివరకు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతూ, ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని అన్నారు.పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మికవర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టామని, ఎందరో అమరవీరులు నేలకొరిగారని, మరెందరో ప్రజలకోసం తమ జీవితాలను త్యాగం చేశారని అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని డిసెంబర్ 26వ నా వాడవాడలా ఎర్రజెండాలు ఎగరేసి సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని కోరారు. క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్న క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, సమాజంలోని బాధితుల పక్షాన నిలబడి ప్రేమను పంచడం.అందరిని సమదృష్టితో చూడటం ద్వారా క్రీస్తు ఆశించిన శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దామని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు బోల్ల ప్రసాద్ రావు, ఆకెన పవన్,మరీదు వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# చాపకింద నీరులా కోవిడ్ వ్యాప్తి

(మొదటి పేజీ తరువాయి..)

కేసుల సంఖ్య 3,128కు చేరినట్లు అధికారులు తెలిపారు. అటు కర్ణాటకలో 73, మహారాష్ట్రలో 50, రాజస్థాన్ లో 11, తమిళనాడులో 9, తెలంగాణలో 8 కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత 24 గంటల్లో కరోనా నుంచి 315 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు కోలుకున్న వారి సంఖ్య 4,44,71,860 చేరుకుంది. దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతంగా ఉండగా.. మరణాల రేటు 1.18 శాతంగా ఉందని తెలిపింది. ఇప్పటివరకూ 220.67 కోట్ల కరోనా వ్యాక్సిన డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. మరోవైపు, థానేలో తాజాగా 5 కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 కేసులు నమోదయ్యాయి. నవంబర్ 30 నుంచి 20 నమూనాలు పరీక్షించగా 5 జేఎన్ 1 కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం థానేలో యాక్టివ్ కేసుల సంఖ్య 28కి పెరిగింది. వారిలో ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు ఇళ్లల్లో కోలుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వేరియంట్ అంత ప్రమాదకరం కాకపోయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ దరించాలని, జనసమూహం ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ఉండొద్దని సూచిస్తున్నారు. డిసెంబర్ 21 నాటికి దేశవ్యాప్తంగా 22 జెఎన్.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 21 కేసులు ఒక్క గోవాలోనే, మరో కేసు కేరళలో వెలుగు చూసినట్లు తెలుస్తోంది. మూడు నెలలకోసారి హాస్పిటల్‌లోని వసతులను రివ్యూ చేసుకోవాలని సూచించింది కేంద్ర ఆరోగ్య శాఖ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాలని తెలిపింది. ప్రస్తుతానికి ఏఔ.1 ÷ఎజీసతిజీనిబి ని ప్రపంచ దేశాలు పరిశీలిస్తున్నాయని, మరీ ప్రాణాలు తీసేంత ప్రమాదకరమైతే కాదని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ వేరియంట్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అంటే... ఓ వేరియంట్ ఇమ్యూనిటీ వలయాన్ని దాటుకుని మరీ వ్యాప్తి చెందడం. ఎప్పటికప్పుడు వైరల్ లక్షణాలనూ మార్చేస్తుందీ వేరియంట్. అందుకు తగ్గట్టుగానే వైద్యంలోనూ మార్పులు చేయాల్సి వస్తుంది. వ్యాక్సిన్‌లు కొత్తగా తయారు చేసుకోవాల్సిందే. అయితే...ప్రజల ప్రాణాలకు ప్రమాదం లేనప్పటికీ ఎక్కువ మందికి సోకే లక్షణముంటుంది ఈ వేరియంట్‌కి. నిపుణులు చెప్పిన వివరాల ప్రకారం..ఈ వైరస్ స్ట్రెయిన్ చాలా సులభంగా రోగ నిరోధక శక్తిని ఛేదించుకోగలదు. అంతే కాదు. అంతే సులభంగా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది.

## ఒకే కుటుంబంలో ఆరుగురికి కరోనా..

తెలంగాణలో కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కరోనా నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన కుటుంబంలోని వృద్ధురాలికి (65) 3 రోజుల క్రితం కరోనా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. ఆమెను వరంగల్ ఎంజీఎంలో చేర్చారు. ఆ కుటుంబంలోని మిగిలిన నలుగురికి కూడా ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో వారిని అధికారులు ఇంట్లోనే ఐసోలేషన్ లో ఉంచారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన పని లేదని డీఎంహెచ్ వో మదుసూదన్ వెల్లడించారు. కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వచ్చినప్పుడు కచ్చితంగా మాస్క్ ధరించాలని, జన సమూహం ఉన్న ప్రాంతాల్లో ఫిజికల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. జిల్లాలో వంద పడకల ఆస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు, తెలంగాణలో ప్రస్తుతం 50 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా కేసులు అలజడి సృష్టిస్తోన్న నేపథ్యంలో పదేళ్ల లోపు చిన్నారులు, 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వచ్చినా, మాస్క్ ధరించాలంటున్నారు. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలని, అనుమానం ఉన్న వారు కరోనా పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తెలంగాణలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో సమీక్షించారు. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని, మెడిసిన్, మాస్కులు, టెస్టుల విషయంలో జాగ్రత్త వహించాలని, ఆర్టీపీసీఆర్ టెస్టుల సంఖ్య పెంచాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 118 ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్స్ లో టెస్టులు చేసేందుకు అవకాశం ఉందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని నిర్దేశించారు. ఇప్పటివరకూ 40 శాంపిల్స్ ను జీనోమ్ సీక్వెన్స్ కు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. వైరస్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# మాట తప్పడం కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే ఉంది

(మొదటి పేజీ తరువాయి..)

రాహుల్ గాంధీపైనా తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే కాంగ్రెస్ హామీలన్నింటినీ మరిచిపోయిందని, కర్ణాటకలో 6 హామీలు ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. 'కర్ణాటకలోని విద్యా సంస్థల్లో హిజాబ్ నిషేధాన్ని ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు దాని గురించి గందరగోళంతో ఉన్నారు. వారు వాగ్దానం అమలు చేయరు. అది వారి డీఎన్‌ఏలోనే ఉంది. దేశ ప్రజలు కాంగ్రెస్ తో ఉండాలా.? వద్దా.? అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది' అంటూ విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపైనా కవిత విమర్శలు గుప్పించారు. ఈ రోజుల్లో కొంత మంది నేతలు తమ 2 నిమిషాల కీర్తి కోసం ప్రజల మతపరమైన మనోభావాలపై దాడిని ఎంచుకుంటున్నారని మండి పడ్డారు. 'సనాతన ధర్మం విషయంలో రాహుల్ గాంధీ ఇంత వరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. మిస్టర్ ఎలక్షన్ గాంధీని సనాతన ధర్మం విషయంలో తన స్టాండ్ అడగాలనుకుంటున్నా. దీనిపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.' అంటూ కవిత వ్యాఖ్యానించారు. అంతకు ముందు బీజేపీ విధించిన హిజాబ్ బ్యాన్ ఆదేశాలను తమ ప్రభుత్వం ఉపసంహరించుకుంటుందని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ప్రకటించారు. దుస్తులు, ఆహారం, ప్రజల ప్రాధాన్యతలకు సంబంధించి ఎలాంటి రాజకీయాలు చేయకూడదని ఉద్ఘాటించారు. అయితే, శనివారం తన ప్రకటనను పునరుద్ఘాటిస్తూ హిజాబ్ పై ప్రభుత్వ నిర్ణయం పరిశీలనలో ఉందని, దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# దేశవ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రపంచ శాంతి కోసం ఏసు జన్మించాడని, అదే విశ్వాసంతో క్రైస్తవ సోదరులు వేడుకలు జరుపుకుంటున్నారని అన్నారు. ప్రముఖ చర్చిల్లో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రార్థనలు కొనసాగుతున్నాయి. విద్యుత్ దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ శాంతి, సౌభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జీసస్ క్రీస్తు బోధనలను గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.ఈ పండుగ సీజన్ అందరికీ ఆనందం, శాంతి, సౌభాగ్యాలను అందించాలని కోరుకుంటున్నాను. క్రిస్మస్‌కు ప్రతీకలైన సామరస్యం, కరుణ స్ఫూర్తిని వేడుకగా సెలబ్రేట్ చేసుకుందాం. ప్రతి ఒక్కరూ ఆనందం, ఆరోగ్యాలతో నివసించే ప్రపంచం కోసం అందరం కృషి చేద్దాం. జీసస్ క్రీస్తు బోధనలు గుర్తుచేసుకుందాం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా ఢిల్లీలోని ప్రఖ్యాత 'సాక్రెడ్ హార్ట్ కేథడ్రల్ చర్చ్'లో ఆదివారం రాత్రి ప్రార్థనలు జరిగాయి. బెంగళూరులోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ కేథడ్రల్‌లో కూడా ఘనంగా ప్రార్థనలు జరిగాయి. క్రిస్‌మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్వీట్ చేశారు. భారతదేశం, విదేశాలలో ఉన్న పౌరులకు, ముఖ్యంగా క్రైస్తవ సోదరులు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. ఈ సంతోషకరమైన సందర్భంగా న్యాయం, స్వేచ్ఛ విలువలపై ఆధారపడిన సమాజాన్ని నిర్మించాలని సంకల్పిద్దాం. యేసుక్రీస్తు బోధలను మన జీవితంలో అనుసరిద్దాం అంటూ ట్వీట్ చేశారు. యేసుక్రిస్తు జీవితం, బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కరుణ, ప్రేమ, సేవ, దయ యేసుక్రిస్తు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. యేసు జీవితం, బోధనలను గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా సుసంపన్నంగా ఆయూరారోగ్యాలతో సామరస్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కాగా.. దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటున్నారు.

# నేడు ఢిల్లీకి సిఎంరేవంత్

(మొదటి పేజీ తరువాయి..)

పలు అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ భేటీ అనంతరం ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో టీపీసీసీ చర్చలు, పార్లమెంట్ ఎన్నికలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇదిలావుంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెట్టి సోమవారం సిఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట ఎన్నారైలు కూడా ఉన్నారు. మర్యాదపూర్వక భేటీ అని తెలుస్తోంది.

# పడిపోయిన ఉష్ణోగ్రతలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/న్యూఢిల్లీ-డిసెంబర్25:

దేశరాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపో యాయి. రాజధాని ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 9.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టంగా పొగ కమ్మేసింది. దట్టమైన పొగ మంచు కారణంగా విజిబిలిటీ సరిగా లేక వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజధాని లోని వివిధ ప్రాంతాల్లో విజిబిలిటీ 125 మీటర్లకు పడిపోయింది.ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లోని వివిధ ఎయిర్ పోర్టుల్లో కూడా విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయింది. ఢిల్లీలోని పాలెం విమానాశ్రయం, అమృత్‌సర్, ఆగ్రా, గ్వాలియర్, ప్రయాగ్‌రాజ్, జైసల్మేర్ విమానాశ్రయాల్లో విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయింది. ఢిల్లీ సఫ్దార్‌గంజ్‌లో 200 మీటర్లు, షిల్లాంగ్ విమానాశ్రయంలో 300 మీటర్లకు విజిబిలిటీ పడిపోయింది. దీంతో జాతీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దట్టమైన పొగ మంచు కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక మరికొన్ని విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

# దాతల సహకారంతో దుప్పట్లు, స్టడీ మెటీరియల్ పంపిణీ

-వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్న గౌడ్

తొర్రూర్ (నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 25:

మండలం కేంద్రం లోని వెంకటాపురం గ్రామంలో సోమవారం రోజున వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్న ఆధ్వర్యంలో వెంకటాపురం సేవా ట్రస్ట్ కు ప్రతినెల దాతలు అందిస్తున్న సహకారంతో గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలకు దుప్పట్ల పంపిణీ, అదేవిధంగా 10వ తరగతి చదువుకునే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండ యాకన్న గౌడ్ మాట్లాడుతూ... వెంకటాపురం గ్రామంలో గత ఐదు సంవత్సరాల పైగా దాతల సహకారంతో సేవా ట్రస్ట్ ద్వారా చాలా కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయడం, నిత్యవసర వస్తువుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిరంతరం గ్రామంలో చేయడం జరుగుతుంది.అందుకు సహకరిస్తున్న దాతలందరికి పేరుపేరునా ధన్యవాదములు తెలియజేస్తు, ఇక ముందు కూడా దాతల సహకారంతో గ్రామంలోని నిరుపేద కుటుంబలను ఆదుకోవడమే వెంకటాపురం సేవ ట్రస్ట్ లక్ష్యంగా పని చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొలగాని శ్రీనివాస్ గౌడ్ , కొండ ఉప్పమ్మ, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహం ఎదుట మనస్మృతి ప్రతుల దహనం

- నిమ్న జాతులపై ఏకంగా ఉన్న మనస్మృతికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం
- నిర్మూలన పోరాట రాష్ట్ర కమిటీ సభ్యుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి (నేటి ఫోకస్‌న్యూస్)-చారగొండ వెంకటేష్ డిసెంబర్ 25:

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం నిర్మూలన పోరాట రాష్ట్ర కమిటీ సభ్యుడు ముద్దునూరు లక్ష్మీనారాయణ సమక్షంలో మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా మనస్మృతిని దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధస్సు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా అచ్చంపేట నడిబొడ్డున డాక్టర్ బాబా సాహెబ్ విగ్రహం ముందు మనస్మృతిని దహనం చేయడం జరిగిందన్నారు. నిమ్న జాతులు వేదాలు చదువురాదని, వినరాదని, చదువుకుంటే నాలికలు తెగ్గోయాలని, వింటే చెవిలో సీసం పోయాలని మనస్మృతిలో పొందపరచడం జరిగిందన్నారు. క్షుద్ర కులాలు పైకోవచ్చే ఏ మాత్రం విధంగా లేకుండా అనగదొక్కబడే విధంగా మనస్మృతి ఉన్నందున ఆనాడు వేలాది మందితో బహిరంగంగా 1927 డిసెంబర్ 25వ. తేదీన ప్రజలు చూస్తుండగానే మనస్మృతిని దహనం చేయడం జరిగిందన్నారు. ఇట్టి విషయం డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ తెలియజేశారని గుర్తు చేశారు. ఆ మహానుభావుని ఆశయ సాధనలో భాగంగా సోమవారం కుల నిర్మూల పోరాట సమితి ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకుడు ఎడ్ల అంబయ్య, తెలంగాణ వ్యతిరేక నిర్వాసిత పోరాట ఫోరం కమిటీ నాయకుడు గోరటి అనిల్ కుమార్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు సామ మాణిక్ బాబు, జనార్ధన్, పాలమూరు అధ్యయన వేదిక నాయకుడు గాజుల లక్ష్మీనారాయణ, నల్లమల్ల కళాకారుల వేదిక నాయకులు బుడగమల్ల మురళి, గెంటల మోహన్, బుద్ధిష్ట సొసైటీ నాయకుడు చంద్రశేకర్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు మంతటి పర్వతాలు, సురేష్, డిటిఎఫ్ నాయకుడు లక్ష్మీనారాయణ, ఎం వి ఎఫ్ నాయకులు, ఉపాధ్యాయుల సంఘం నాయకుడు మల్లేష్ తో పాటు దళిత సంఘాల నేతలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సింగరేణిలో ముగిసిన ప్రచారం

- చివరిరోజు మంత్రుల పర్యటన
- సిపిఐ తరపున కూనంనేని ప్రచారం

**కొత్తగూడెం,డిసెంబర్25**

సింగరేణి ఎన్నికల ప్రచారం ముగిసింది. మంత్రులు శ్రీదర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిపిఐ నేత కూనంనేనిలు జోరుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఎఐటియూసి గెలుపుకోసం మంత్రులు పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరాల జల్లు కురిపించారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేపడతామని, కార్మికులకు ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. భద్రాద్రి జిల్లా ఇల్లందు, కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్మికుల వైద్యానికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని, ఎలాంటి ఖర్చు లేకుండా కారుణ్య నియామకాలు చేపడతామని అన్నారు. 'సింగరేణి దినోత్సవం రోజున సెలవుగా ప్రకటిస్తాం.

మహిళా కార్మికులు గని లోపల కాకుండా బయటే పని చేసే అవకాశం కల్పిస్తాం. కార్మికుల న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిష్కరిస్తాం.' అని మంత్రి స్పష్టం చేశారు. సింగరేణి వ్యాప్తంగా ఒక్క చోట మినహా అన్ని చోట్లా కాంగ్రెస్ విజయం సాధించిందని, కార్మికుల గుండెల్లో కాంగ్రెస్ ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థ అయిన ఐఎన్టీయూసీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 'గతంలోనే జరగాల్సిన ఎన్నికలను ఓటమి భయంతో గత ప్రభుత్వం నిర్వహించలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. నేను మంత్రిగా ఉన్నా. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎం పక్కన కూర్చునైనా సంతకం పెట్టిస్తాను. గత ఐదేళ్లలో సింగరేణి గనులు కనుమరుగై కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. పోరాటాలు చేశాం అని చెప్పుకొనే కార్మిక సంఘాలు ఇక ఉండవు. 20 ఏళ్లు ప్రభుత్వంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే.' అని మంత్రి వ్యాఖ్యానించారు. అటు పెద్దపల్లిలో కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నిజం చేస్తామని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ వేస్తామని, ఎఐటియూసి కార్మిక సంఘాన్ని గెలిపించాలని కోరారు. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత జరుగుతున్న సింగరేణి సంస్థ కార్మిక సంఘం ఎన్నికల ప్రచారానికి నేటితో తెర పడింది. ఈ నెల 27న బుధవారం గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. దాదాపు 13 గుర్తింపు పొందిన సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతుండగా, కార్మిక శాఖ అందించిన వివరాల ప్రకారం మొత్తం 39వేల 832 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారగా, గత 20 రోజులుగా ప్రచారం హోరెత్తించారు. భూపాలపల్లి సింగరేణి డివిజన్ లో ఓపెన్ కాస్ట్ లతో కలుపుకొని 5 గనులు ఉండగా, ఇందులో 5,350 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సింగరేణి వ్యాప్తంగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి, అనంతరం అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు.

## యువకుడి ర్యాష్ డ్రైవింగ్

- యువతికి తీవ్ర గాయాలు...ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్,డిసెంబర్25:**

నగరంలోని నారాయణగూడలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఓ యువకుడు ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఆమె తీవ్రంగా గాయపడింది. బస్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ యువతిని టూవీటలర్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. లిబర్టీ చౌరస్తా నుంచి ఎల్బీ స్టేడియానికి వెళ్లే దారిలో మోర్ మెడికల్ షాప్ ఎదురుగా ఉన్న బస్ స్టాప్‌లో సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో 20 ఏళ్ల యువతి బస్సు కోసం ఎదురుచూస్తుంది. అదే సమయంలో కెనటిక్ హోండా పైన వేగంగా వచ్చిన యువకుడు ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు 108 ను పిలిచి ఉస్మానియా ఆస్పత్రికి యువతిని తరలించారు. నారాయణగూడ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి యువకుడిని ప్రమాదానికి గురైన బండిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కారును ఢీకొన్న లారీ..

- సీటు బెల్టుతో బయటపడ్డ దంపతులు

**రాజన్న సిరిసిల్ల,డిసెంబర్25 :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కారును ఢీకొట్టింది ఓ లారీ. కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో డివైడర్ దాటి పల్టీలు కొట్టింది కారు. ప్రమాదం నుంచి కారులో ప్రయాణిస్తున్న దంపతులు ప్రాణాలతో బయటపడ్డారు. స్వల్ప గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న గంగాధరకు చెందిన రామిడి జలపతి, విజయలక్ష్మి దంపతులు కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరూ సీటు బెల్ట్ ధరించడంతో పెను ప్రమాదం తప్పింది. వేములవాడ మొదటి బైపాస్ ఎల్ఐసీ ఆఫీస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. విషయం తెలియగానే ఘటనా స్థలానికి పట్టణ సీఐ కరుణాకర్ చేరుకున్నారు. ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకున్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్లే జలపతి దంపతులకు ప్రమాదం తప్పిందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ.. ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు సీఐ కరుణాకర్.

## ఛత్తీస్‌ఘఢ్ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోల హతం

**రాయపూర్,డిసెంబర్25 :**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ సుక్మా జిల్లాల సరిహద్దులోని తుమక్‌పాల్-దబ్బాకున్నా గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. దంతెవాడ జిల్లాలో నక్సలైట్లు కదలికలు ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీస్‌లు, ఆర్మీ జవాన్లు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. కాటే, కళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల దబ్బాకున్నా గ్రామ శివార్లలోని కొండపై ఉన్న నక్సలైట్లను ఆదివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో భద్రతా సిబ్బంది చుట్టుముట్టడంతో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్ రాజ్ చెప్పారు. సంఘటన స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభ్యమైనట్టు తెలిపారు.

## బొగ్గుపెల్లలు పడి లారీ గైవర్ దుర్మరణం

**జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్25 :**

జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బొగ్గు పెల్లలు మీద పడి లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన గణపురం మండలం కేటీపీపీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుర్ర కొమురయ్య అనే లారీ డ్రైవర్ మృతి కేటీపీపీలో బొగ్గులోడుతో వెళ్లిన ఆయన అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బొగ్గు పెల్లలు మీద పడ్డాయి. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొమురయ్య మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి.

# వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

**నల్లగొండ,డిసెంబర్25 :**

పొగమంచు ప్రాణాలు తీస్తోంది. వాహనాలు డ్రైవింగ్ చేయాడానికే వణికిపోతున్నారు డ్రైవర్లు. పొగమంచు కారణంగా నల్లగొండ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. నిడమనూరు మండలం వేంపాడు స్టేజి వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతన్ని చూసేందుకు వస్తున్న బంధువులు కూడా ప్రమాదం బారిన పడ్డారు. పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండాకు చెందిన వారంత ఆటోలో వేంపాడు వస్తున్నారు. వాళ్లు వస్తున్న ఆట పార్వతీపురం వద్ద ప్రమాదానికి గురైంది. ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టడంతో నలుగురు చనిపోయారు. ముగ్గురు స్పాట్‌లోనే మృతి చెందారు. ఇంకో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉంది. గుణ్య, నాగరాజు, పాండ్య, బుజ్జి చనిపోయిన వారిలో ఉన్నారు. రోడ్డు ప్రమాదంలోనే గంటల వ్యవధిలోనే ఐదుగురు చనిపోవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. మక్తల్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. నారాయణపేట జిల్లా మక్తల్ పీఎస్ పరిధిలోని జక్లెయిర్ వద్ద వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న కారు ఓవర్‌టేక్ చేసింది. ఈ ప్రయత్నంలో ఆ కారు ఎదురుగా వస్తున్న వెహికల్‌ను ఢీ కొట్టింది. వికారాబాద్ జిల్లాలో పొగ మంచు కారణంగా ప్రమాదం జరిగింది. శివారెడ్డిపేట్ చెరువులోకి కారు దూసుకెళ్లింది. హైదరాబాద్ వెళ్తుండగా యాక్సిడెంట్ జరిగింది. ప్రమాద సమయంలో కారులో ఐదు మంది ప్రయాణిస్తున్నారు. ఈ దుర్ఘటనలో ఒక్కరు గల్లంతయ్యారు. నలుగురు సురక్షితంగా బయట పడ్డారు. క్రేన్ సాయంతో కారును అధికారులు బయటకు తీశారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నిడమనూరు మండలంలో వెంపాడు స్టేజి వద్ద నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓ బైకు ఢీకొట్టింది. దీంతో బైకర్ కేశవులు తో పాటు పాదచారి సైదులు మృతిచెందారు. కేశవులు మరణవార్త తెలుసుకు న్న అతని కుటుంబ సభ్యులు పెద్దవూర మం డలం మల్లెవాని కుంట తండా నుంచి ఆటోలో ప్రమాద స్థలికి బయల్దేరారు. ఈ క్రమంలో పార్వతీపురం వద్ద వారి ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనా స్థలానికి చేరుకు న్నారు. క్షతగాత్రు లను దవాఖానకు తరలించారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు దవాఖా నలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపా రు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉం దని చెప్పారు. మృతులను గుణ్య, నాగరాజు, పాండ్య, బుజ్జిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో మల్లెవానికుంటలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదం దుర్ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు మృత్యువాత పడటంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ.. సంతాపం ప్రకటించారు. మృతుల కుటుం బాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

## మేడారం వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

**ములుగు,డిసెంబర్25 :**

మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలను పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకున్నారు. ముందుగా పసరలోని గుండ్ల వాగు బ్రిడ్జిని, దయ్యాలవాగు సమీపంలో ఉన్న రోడ్డును చింతల్ క్రాస్ వద్ద రోడ్డు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అదే విధంగా చిలుకల గుట్ట, వీఐపీ పార్కింగ్ బస్ స్టాండ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు షాక్

### కాంగ్రెస్‌లోకి ఇద్దరు కౌన్సిలర్లు

**కామారెడ్డి,డిసెంబర్25 :**

కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ సమక్షంలో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. షబ్బీర్ అలీ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ పరిణామంతో బీఆర్ఎస్ కేడర్ అయోమయంలో పడిపోయింది. 4వ వార్డు కౌన్సిలర్ పిడుగు మమత సాయిబాబా, 29వ వార్డు కౌన్సిలర్ అస్మా అఫ్రిన్ అంజద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 6 గ్యారంటీ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కౌన్సిలర్లు తెలిపారు. మరికొంత మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సమాయత్తం




అవుతున్నట్లు తెలుస్తోంది.

# వ్యక్తి అనుమానాస్పద మృతి

**ములుగు,డిసెంబర్25:**


జిల్లాలోని మంగపేట మండలం మల్లూరు గుట్టలో ఆకా శ్రీను(42) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఆదివారం బంధువుల పుట్టువెంట్రుకల కార్యక్రమానికి మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి గుట్టకు శ్రీను వచ్చాడు. స్నానానికి వెళ్లి శ్రీను కనిపించకుండా పోయాడు. సోమవారం గుట్టపై ఎద్దుముక్కుతోగు వద్ద శవమై అతను కనిపించాడు. మృతుడి వీపు, ఛాతిపై గాయాలు కనిపిస్తున్నాయి. శ్రీను మృతిపై బంధువులు ఫిర్యాదు చేశారు. బంధువులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సహాయంతో పరిసరాలను పరిశీలిస్తున్నారు. ఆలయం దగ్గరలోని సీసీ కెమెరాలను పోలీసులు ఆధారాల కోసం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

- విద్యుత్ దీపాలతో అలంకరణ
- అనాథ బాలలతో వేడుక్లో పవన్ సతీమణి

**మెదక్,డిసెబబర్25 :**

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రసిద్ధ మెదక్ సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు మొదటి ఆరాధనతో బిషప్ కే. పద్మారావు వేడుకలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పద్మారావు దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకొంటున్న వారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చర్చికు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా మెదక్ చర్చి విద్యుత్ కాంతులతో జిగేల్‌మనేలా ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని సెంట్ ఆండ్రూస్ చర్చిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా, వైరా రోడ్ ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇదిలావుంటే నటుడు, జనసేన



అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అనా కొణిదెల క్రిస్మస్ వేడుకలను అనాథ శరణాలయంలో నిర్వహించారు. హైదరాబాద్ బాలాజీ స్వర్ణపురి కాలనీలో ఉన్న జీవోదయ హోమ్ ఫర్ ద చిల్డ్రన్స్ ఆశ్రమంలోని చిన్నారులతో ముచ్చటించి.. వారికి విద్యాబుద్ధుల గురించి తెలియజేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి.. అందరికీ పంచిపెట్టి.. నిత్యావసర సరుకులను అందజేశారు.

## సింగరేణిలో చివరి వరకు ప్రచారం

- జోరుగా ప్రచారం పెంచిన టిజిబికెఎస్

**రామగుండం,డిసెంబర్25 :**

సింగరేణిలో గత వారం నుంచి గనులు, వివిధ విభాగాల వద్ద జోరుగా ప్రచారం చేసిన నాయకులు చివరి రోజు ఓమవారం కూడా కూడా కార్మికులు, ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తమకే ఓటేయాలని కార్మికులను కోరారు. సింగరేణిని కాపాడుకోవడం, మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ప్రధాన సమస్యలపైనా అన్ని సంఘాలు హామీలు గుప్పిస్తున్నాయి. టీబీజీకేఎస్ ఆధ్వర్యం లో సాధించిన హక్కులు, సౌకర్యాలను వివరిస్తూ ఓట్లు అడిగారు. ప్రధానంగా టీబీజీకేఎస్ నాయకులు చివరి నిముషంలో పోటీలోకి దిగడంతో ప్రచారం జోరుగా సాగించారు. ప్రతి ఒక్క కార్మికుడిని కలువాలని ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. మూడు షిఫ్టుల్లో కార్మికులను కలిసి ఓట్లు అడుగుతున్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయభేరి మోగించి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ సింగరేణికి చేసిన మేలును వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. కారుణ్య నియామకాల ద్వారా 16 వేల మందికి ఉద్యోగాలు, కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, 26 వారాల మెటర్నటీ లీవ్‌లు, అన్ని మతాల పండుగలకు పెయిడ్ హాలిడే, ఐఐటీ, ఐఐఎంలలో సీటు

సాధించిన కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇల్లు కట్టుకునే వారికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం, సింగరేణి ఏరియాల్లో నివసించే వారికి పట్టాల పంపిణీ, డ్యూటీలో మృతి చెందిన కార్మికుడికి రూ. 20 లక్షల పరిహారం, రిటైర్డ్‌మెంట్ వయసు 61కి పెంపువంటివి వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత సూచనలతో అధ్యక్షుడు వెంకట్రావ్,ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య నాయకత్వంలో మూడోసారి గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సింగరేణి అభివృద్ధికి కేసీఆర్ సర్కారు ఎంతో కృషి చేసిందని,కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కవిత పేర్కొన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలు తిరిగి సాధించుకున్నాం. ఈ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం ఒంటరిగానే పోటీ చేస్తోంది. ఎవరూ అధైర్య పడవద్దు.. మూడోసారి విజయం మనదే అని ఆమె పిలుపునిచ్చారు.

## సింగరేణి ఉద్యోగులకు న్యాయం చేస్తాం

- ఇంటి సమస్యలు తక్షణం తీరుస్తాం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీదర్ బాబు హామీ

**పెద్దపల్లి,డిసెంబర్25 :**

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీ కార్మిక సంఘాన్ని గెలిపించాలని సింగరేణి కార్మికులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. సింగరేణి కార్మికుల సొంత ఇంటి కలను నిజం చేస్తామన్నారు. సింగరేణి ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఆర్జీ 3 పరిధిలోని ఏఎల్‌పీ, ఓసీపీ 1, ఓసీపీ 2 బొగ్గు గనుల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ తరుపున మంత్రి శ్రీధర్ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ఏర్పాటు చేస్తామన్నారు. డిపెండెంట్ కార్మికులకు డబ్బులు ఖర్చు కాకుండా ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిస్కారానికి హైపవర్ కమిటీ ఏర్పాటు చేస్తామని శ్రీధర్ బాబు ప్రకటించారు. కార్మికుల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ ఉందని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని మంత్రి వ్యాఖ్యానించారు. సింగరేణిలో టీబీజీకేఎస్ మాయమాటలు చెప్పి రెండు పర్యాయాలు గెలిచిందని, బీఆర్ఎస్ పార్టీలో ఉండి మోసపోయి గోసపడి ఈరోజు విముక్తి అయ్యారన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం కృషి చేస్తానన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో 15 వేల మంది ఉద్యోగాల తగ్గింపు జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను చేపట్టే కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు.ఇన్‌కంటాక్స్ మినహాయింపు కార్యక్రమాన్ని మన ప్రభుత్వం తీసుకోబోతుందని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కారుణ్య నియామకాలు న్యాయంగా జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కారుణ్య నియామకాల కోసం ఉద్యోగానికి లక్షలు చేతులు మారాయని, కారుణ్య నియామకాల కోసం ఖర్చు పెట్టుకుండా ఇప్పించే బాధ్యత తనదని మంత్రి స్పష్టం చేశారు.

## సింగరేణిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రచారం

**భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్25ం:**

సింగరేణి ప్రాంతంలో ఉన్న కార్మిక సోదరులందరూ ఐఎన్‌టియుసిని ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.కార్మికుల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ ఉందని, వారి గుండెల్లో ఇందిరమ్మ రాజ్యం ఉందని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. సింగరేణిలో టీబీజీకేఎస్ మాయమాటలు చెప్పి రెండు పర్యాయాలు గెలిచిందని, బీఆర్ఎస్ పార్టీలో ఉండి మోసపోయి గోసపడి ఈరోజు విముక్తి అయ్యారన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం కృషి చేస్తానన్నారు. సోమవారం ఇల్లందు సింగరేణి జెకే ఓపెన్ కాస్ట్ కార్యాలయం వద్ద ఐఎన్టీయూసీ విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన పిట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కోరం కనకయ్యను అధిక మెజార్టీతో గెలిపించిన ఓటర్లకి అభినందనలు తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో 15 వేల మంది ఉద్యోగాల తగ్గింపు జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను చేపట్టే కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు.జేకేఓసి ఎక్స్‌టెన్షన్ చేస్తామని, కార్మికులకు రూ. 20 లక్షల వడ్డీలేని రుణాన్ని అమలు చేస్తామని, ఇన్‌కంటాక్స్ మినహాయింపు కార్యక్రమాన్ని మన ప్రభుత్వం తీసుకోబోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కారుణ్య నియామకాలు న్యాయంగా జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కారుణ్య నియామకాల కోసం ఉద్యోగానికి రూ. నాలుగు లక్షలు చేతులు మారాయని, కారుణ్య నియామకాల కోసం ఖర్చు పెట్టుకుండా ఇప్పించే బాధ్యత తనదని మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రిస్మస్ సోదరులకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు తెలిపారు.

## కూనంనేనిని అడ్డుకున్న భద్రతా సిబ్బంది

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,డిసెంబర్25 :**

కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. సింగరేణి హెడ్ కార్యాలయం వద్ద గుర్తింపు ఎన్నిక ప్రచారానికి ఎమ్మెల్యే కూనంఏని సాంబశివరావు వచ్చారు. అయితే అనుమతి లేదని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది మధ్య వాగ్వాదం నెలకొని ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో



ఏఐటీయూసీ అధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. కాగా కొత్తగూడెం హెడ్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సాంబశివరావును సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవటంపై యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. సెక్యూరిటీ చీఫ్, సిబ్బందిపై సింగరేణి డైరెక్టర్ పా సీరియస్ అయ్యారు.

# నేటినుంచి సఫారీ గడ్డపై తొలిటెస్ట్

**ఊపుమీదున్న రోహిత్ సేన**

**గత చరిత్రను తిరగరాయాలన్న పట్టుదల**



**న్యూఢిల్లీ,డిసెంబర్25:**
దక్షిణాఫ్రికాతో మరోసారి టెస్టు సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమైంది. సఫారీ గడ్డపై ఇప్పటివరకూ టెస్టు సిరీస్ విజయాన్ని అందుకోలేకపోయిన భారత జట్టు.. ఈసారి చరిత్ర తిరగరాయాలనే పట్టుదలతో ఉంది. మంగళవారం నుంచి టెస్ట్ క్రికెట్ జరుగనుంది. అప్పుడు తొలి మ్యాచ్ గెలిచి మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. ఆ తర్వాత రెండు టెస్టుల్లో తడబడి ఓటమి పాలైంది. మరి ఈసారి దాదాపు పూర్తిగా మారిన జట్టుతో, కొత్త ఉత్సాహంతో రెండు టెస్టుల సిరీస్‌లో అడుగుపెడుతున్న భారత్ సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించాలని చూస్తోంది. సెంచూరియాన్ వేదికగా డిసెంబర్-26 నుంచి దక్షిణాఫ్రికా-భారత్ తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను శుభారంభం చేయాలని ఇరు జట్లు భావిస్తున్నాయి. ఈ మ్యాచ్ కోసం దక్షిణాఫ్రికా,భారత జట్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాయి. తమ సొంత గడ్డపై టెస్టుల్లో భారత్‌పై అధిపత్యాన్ని చెలాయించాలని సౌతాఫ్రికా భావిస్తుంటే.. టీమిండియా మాత్రం తొలిసారి సఫారీ గడ్డపై టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకోవాలని కసితో ఉంది. ఈ సిరీస్‌కు టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అందుబాటులో ఉన్నారు. వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఈ సీనియర్ ద్వయంకు ఇదే తొలి ద్వైపాక్షిక సిరీస్ కావడం గమనార్హం. ఇప్పటివరకూ ఆ దేశంలో ఎనిమిదిసార్లు టెస్టు సిరీస్ ఆడిన మన జట్టు ఒక్కసారి కూడా విజేతగా నిలవలేదు. చివరగా 2021-22 సిరీస్‌లో దక్షిణాఫ్రికాలో భారత్ ఆడింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు జట్టులో ఎన్నో మార్పులు జరిగాయి. కొత్త ఆటగాళ్లు వచ్చారు. ఇప్పుడు సరికొత్త ఉత్సాహంతో సఫారీ సవాలుకు భారత్ సై అంటోంది. 2021 టీ20 ప్రపంచకప్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్‌గా కోహ్లి తప్పుకున్నాడు. వన్డేల్లో, టెస్టుల్లో సారథిగా కొనసాగాలనుకున్నాడు. కానీ టీ20లతో పాటు వన్డేల్లోనూ ఒకరే కెప్టెన్ ఉండాలనుకున్న బీసీసీఐ ఆ బాధ్యతలను రోహిత్‌కు అప్పగించింది. గతేడాది దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత టెస్టు కెప్టెన్సీకి కూడా కోహ్లి గుడ్‌బై చెప్పి షాకిచ్చాడు. భారత జట్టు కెప్టెన్‌గా పూర్తిగా తప్పుకున్నాడు. అప్పటి నుంచి మూడు ఫార్మాట్లలోనూ రోహిత్ కెప్టెన్సీ కెరీర్ ఆరంభమైంది. ఇప్పుడు మళ్లీ దక్షిణాఫ్రికాతో టెస్టుల కోసం అక్కడికి వెళ్లిన కోహ్లి.. ఇప్పుడు కేవలం ఆటగాడిగానే ఆడబోతున్నాడు. 2021-22 టెస్టు సిరీస్‌తో పోలిస్తే ఇప్పుడు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న జట్టులో చాలా మార్పులు జరిగాయి. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు చెతేశ్వర్ పుజారా, అజింక్య రహానె ఇద్దరూ లేకుండా భారత టెస్టు జట్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ ఇద్దరు టెస్టు స్పెషలిస్టు బ్యాటర్లలో ఒక్కరు కూడా జట్టులో లేకుండా భారత్ విదేశాల్లో టెస్టు ఆడబోతుండటం గత దశాబ్ద కాలంగా ఇదే మొదటిసారి. ఈ ఇద్దరు లేకుండా భారత్ దక్షిణాఫ్రికాలో సిరీస్ ఆడబోతుండటం కూడా 2006 తర్వాత ఇదే తొలిసారి. టెస్టు అరంగేట్రం తర్వాత దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్‌కు పుజారా, రహానె దూరమవడం ఇదే మొదటిసారి. 2022లో సొంతగడ్డపై శ్రీలంకతో సిరీస్‌లో రెండు టెస్టుల్లో ఈ ఇద్దరికీ చోటు దక్కలేదు. కానీ తిరిగి పుంజుకుని వీళ్లు జట్టులోకి వచ్చారు. అయితే ఇప్పుడేమో దక్షిణాఫ్రికా సిరీస్‌కు మాత్రం ఎంపిక కాలేకపోయారు. దక్షిణాఫ్రికాలో గత భారత జట్టు టెస్టు సిరీస్‌తో పోలిస్తే ఈ సారి జట్టులో చాలా కొత్త ముఖాలున్నాయి. తొలి టెస్టు తుది జట్టులో ఉన్న వాళ్లలో కేఎల్ రాహుల్, కోహ్లి, అశ్విన్, శార్దూల్, బుమ్రా, సిరాజ్ మాత్రమే ఇప్పుడూ జట్టుతోనూ ఉన్నారు. వీళ్లతో పాటు యశస్వి జైస్వాల్, కేఎస్ భరత్, ముకేశ్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ కొత్తగా జట్టుతో చేరారు.

## సఫారీతో టెస్టులో

## తొలిసారి కెప్టెన్‌గా రోహిత్ శర్మ

**విజయం కోసం కృషి చేస్తామని వెల్లడి**



**న్యూఢిల్లీ,డిసెంబర్25 :**
వన్డే వరల్డ్‌కప్-2023 తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తొలిసారి మైదానంలో అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత జట్టును రోహిత్ నడిపించనున్నాడు. సఫారీ గడ్డపై ఇప్పటివరకు అందని ద్రాక్షగా ఉన్న టెస్టు సిరీస్‌ను.. ఈ సారి సొంతం చేసుకుని తన పేరును సువర్ణ అక్షరాలతో లిఖించుకోవాలని హిట్‌మ్యాన్ పట్టుదలతో ఉన్నాడు. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు డిసెంబర్ 26 నుంచి సెంచూరియన్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ప్రీమ్యాచ్ కాన్ఫరెన్స్‌లో రోహిత్ పాల్గొన్నాడు. ప్రపంచ కప్ ఓటమి గురించి రోహిత్ శర్మను మరోసారి విలేకరులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రోహిత్ మాట్లాడుతూ.. 'ప్రపంచకప్‌లో మేము అద్భుతమైన ప్రదర్శన కనబరిచాం. ట్రోఫీ కోసం చాలా చాలా కష్టపడ్డాము.ఫైనల్ మ్యాచ్‌లో మేము కొన్ని విభాగాల్లో రాణించలేకపోయాం. ఆఖరిపోరులో ఓడిపోవడం చాలా బాధ కల్గించింది. కానీ ఆ విషయాన్ని మర్చిపోయి ముందుకు పోవడానికి కొత్త దారులు వెతకాలి. ఓటమి తర్వాత చాలా మంది మాకు మద్దతుగా నిలిచారు. అది వ్యక్తిగతంగా నన్ను ఓటమి బాధ నుంచి కోలుకునేలా ప్రేరేపించింది. ప్రస్తుతం నా దృష్టి సౌతాఫ్రికా సిరీస్ పైనే ఉంది. పరిస్థితులు ఎలా ఉన్న నేను బాగా బ్యాటింగ్ చేయడానికి 100 శాతం ప్రయత్నిస్తాను అని చెప్పుకొచ్చాడు. ఇక ప్రోటీస్ సిరీస్‌లో రోహిత్‌తో పాటు స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రా కూడా భాగమయ్యారు.



## కంగారులతో వన్డే, టీ 20 పసీరిస్

**మహిళా జట్టు ఎంపిక**

**ముంబై,డిసెంబర్25 :**
టెస్టు క్రికెట్‌లో తొలిసారి ఆస్ట్రేలియాను ఓడించి చారిత్రాక విజయాన్ని అందుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు.. కంగారులతో వన్డే, టీ20 సిరీస్‌లకు సై అంటోంది. భారత్, ఆసీస్ మధ్య డిసెంబరు 28, 30, జనవరి 2 తేదీల్లో మూడు వన్డేలు.. జనవరి 5,7,9 తేదీల్లో మూడు టీ20లు జరగనున్నాయి. ఈ సిరీస్ బీసీసీఐ జట్లను ప్రకటించింది. శ్రేయాంకా పాటిల్, సైకా ఇషాక్‌లను మొదటిసారి వన్డేలకు ఎంపిక చేశారు. 19 ఏళ్ల యువ బౌలర్ టిటాస్ సాధు రెండు ఫార్మాట్‌లలో చోటు దక్కించుకుంది. వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టునే దాదాపుగా టీ20 సిరీస్‌కు కొనసాగించారు. స్నేహ్ రాణా, హర్లీన్ డియోల్‌లను వన్డే సిరీస్‌లో మాత్రమే అవకాశం కల్పించారు. వారి స్థానంలో కనికా అహుజా, మిన్ను మణిలను టీ20 సిరీస్‌కు తీసుకున్నారు.

**వన్డే సిరీస్‌కు జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, యాస్తికా భాటియా (వికెట్ కీపర్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమంజోత్ కౌర్, శ్రేయాంకా పాటిల్, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుకా సింగ్, టిటాస్ సాధు, పూజా వస్త్రాకర్, స్నేహ రాణా, హర్లీన్ డియోల్.

# భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్

**స్వాగతించిన రియో ఒలంపిక్స్ విజేత సాక్షిమాలిక్**



**న్యూఢిల్లీ,డిసెంబర్25(ఆర్ఎన్ఎ):**
భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్ విధించడాన్ని రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ స్వాగతించారు. 'డబ్ల్యూఎఫ్ఐ మంచికి ఇది తొలి అడుగుగా భావిస్తున్నా. మేం ఎందుకిలా పోరాడుతున్నామనే విషయం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వానికి బోధపడుతుందని ఆశిస్తున్నా. మహిళా అధ్యక్షురాలుంటే దేశంలోని అమ్మాయిలకెంతో మేలు జరుగుతుంది' అని ఆమె అన్నారు. ఇక 'పద్మశ్రీ'ని వెనక్కిచ్చిన టోక్యో ఒలింపిక్స్ పతక విజేత బజరంగ్ పూనియా మాట్లాడుతూ.. 'ఇప్పటికే నా పురస్కారాన్ని తిరిగిచ్చేశాను. మళ్లీ ఆ అవార్డును స్వీకరించే యోచన లేదు. మాకు న్యాయం జరిగినపుడు 'పద్మశ్రీ'ని తీసుకుంటా. మన అక్కాచెల్లెళ్లు, కుమార్తెల గౌరవం కంటే ఏ అవార్డు పెద్దది కాదు. ప్రస్తుతం సమాఖ్య వ్యవహారాల్ని అందరు గమనిస్తున్నారు' అని అన్నారు. కాగా భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ సాక్షి మాలిక్, వినేశ్ ఫొగట్ తదితర మహిళా రెజ్లర్లు ఢిల్లీలో నిరసన చేసిన విషయం తెలిసిందే. వీరికి మద్దతుగా బజరంగ్ పునియా, జితేందర్ సింగ్ వంటివారు ఆందోళనలో పాల్గొన్నారు. బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నెలరోజులకు పైగా నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో ప్రభుత్వ హామీతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉంటే.. అనేక వాయిదాల అనంతరం ఇటీవలే భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జరిగాయి. ఇందులో మాజీ రెజ్లర్ అనిత షెరాన్ ప్యానెల్‌పై.. బ్రిజ్‌భూషణ్ అనుచరుడు సంజయ్ సింగ్ ప్యానెల్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా సంజయ్ ఎన్నికను నిరసిస్తూ సాక్షి మాలిక్ ఆటకు స్వస్తి పలకగా.. బజరంగ్ పునియా, బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ ఆమెకు మద్దతుగా పద్మ శ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేశారు. ఈ పరిణామాల క్రమంలో డబ్ల్యూఎఫ్ఐ రాజ్యాంగాన్ని, నిబంధనలు ఉల్లంఘించారనే కారణంగా సంజయ్ సింగ్ ప్యానెల్‌పై కేంద్ర క్రీడా శాఖ వేటు వేయడం ఆసక్తికరంగా మారింది. బ్రిజ్ భూషణ్ జోక్యంతోనే సంజయ్ ఎవరినీ సంప్రదించకుండా ఇష్టారీతిన పోటీల నిర్వహణ అంశాన్ని ప్రకటించారని.. అందుకే డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ పడిందనే విమర్శలు వెల్లువెత్తాయి.

# మళ్లీ బిజీ అవుతున్న నిత్యామీనన్




ఆ మధ్య కాస్త నిదానించిన నిత్యామీనన్ గత ఏడాది 'తిరు' సినిమాతో మళ్లీ జూలు విదిల్చింది. అటు తమిళంలో, ఇటు తెలుగులో మంచి హిట్ అందుకుంది. దాదాపు తన కెరీర్ ముగిసిందని అందరూ అనుకుంటున్న సమయంలో వచ్చిన 'తిరు' నిత్యామీనన్‌కి మళ్లీ పెద్ద బ్రేక్‌గా నిలిచిందని చెప్పక తప్పదు. ఆ తర్వాత 'కుమారి శ్రీమతి' వెబ్‌సిరీస్ కూడా తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం తమిళంలో జయం రవి హీరోగా తను నటిస్తున్న చిత్రం 'కాదలిక్క నేరమిల్లై'. 60ఏళ్ల క్రితం ఇదే పేరుతో తమిళంలో ఓ చిత్రం రూపొందింది. ఆ సినిమా ఇప్పటికీ అక్కడ క్లాసిక్. ఆ పేరుతో ఇప్పుడు సినిమా చేయడం అంటే నిజంగా సాహసమే. ఉదయ్‌నిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆయన భార్య కిరుతిగ ఉదయ్‌నిధి దర్శకురాలు. ఈ సినిమా గురించి నిత్యామీనన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'మణిరత్నం 'ఓకే కణ్మని' తర్వాత నేను చేస్తున్న పూర్తిస్థాయి ప్రేమకథ ఇది. ఇందులో పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. కురితిగ అద్భుతమైన దర్శకురాలు. తను నా పాత్రను తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేశాం. బహుశా సమ్మర్‌లో విడుదల ఉండొచ్చు. నేను మాత్రం ప్రేక్షకుల మధ్యలో కూర్చొని ఈ సినిమా చూస్తా' అని చెప్పుకొచ్చింది నిత్యామీనన్

## సితారతో మహేశ్‌బాబు చిత్రం..

# లైక్ కొట్టిన అర్జున్

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ప్రతి అగ్రనటుడికి సామజిక మాధ్యమాల్లో విపరీతమైన ఫాలోయింగ్ ఉండటమే కాకుండా, వాళ్ళు పెట్టిన పోస్టులు వార్తలుగా కూడా అవుతూ ఉంటాయి. అలాగే తెలుగులో నటులకు వున్నన్ని అభిమాన సంఘాలు, అభిమానులు వేరే భాషా నటులకి లేవు. నటులకు లేకున్నా అభిమానులకు మాత్రం విభేదాలు ఉంటాయి. పక్కహీరోతో పోల్చి విమర్శలు చేస్తుంటారు. కలెక్షన్స్, రికార్డుల వలెనే ఈ అగ్ర నటుల మధ్య అంతరాలు వస్తూ ఉంటాయి అని అభిమానులు అనుకుంటూ వుంటారు. కానీ నిజానికి ఈ నటుల మధ్య ఎటువంటి విభేదాలు వుండవు. ప్రొఫెషనల్ గా వాళ్ళ మధ్య పోటీ ఉండొచ్చు ఏమో గానీ, నటులుగా వాళ్ళందరూ ఒకటే. ఇంతకు ముందు చాలామంది అదే విషయాన్నీ వేదికలమీద కూడా చెప్పారు, కానీ సామజిక మాధ్యమాల్లో మాత్రం అభిమానులు ఇతర నటుల్ని దూషించడం లాంటివి చేస్తూ వుంటారు. అయితే మా మధ్య అలాంటివి లేవని అల్లు అర్జున్ ద్వారా మరోమారు నిరూపించారు. మహేష్ బాబు తన కుమార్తె సితార పాపతో వున్న ఫోటో ఒకటి తన ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఆ పోస్టుకి అల్లు అర్జున్ లైక్ కొట్టారు, ఇప్పుడు ఇది వైరల్ అవుతోంది. అల్లు అర్జున్, మహేష్ బాబు పెట్టిన ఫోటోకి లైక్ కొట్టారు అని సామజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ వస్తోంది. అల్లు అర్జున్ తో పాటు, సమంత, శృతి హాసన్, అడివి శేష్ ఇంకా చాలామంది ఈ ఫోటో కి లైక్ కొట్టారు. అయితే ఇలా ఒక స్టార్ పెట్టిన పోస్టుకి ఇంకో స్టార్ లైక్ కొట్టడం కూడా వైరల్ అవటం, అభిమానులని అలరించటం సంతోషమే కదా!






## సలార్ లైన్ వినగానే...

# మెరుపులా అనిపించింది

**చిత్రం ఒప్పుకోవడంపై ప్రభాస్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'సలార్' సక్సెస్‌ని ఆస్వాదిస్తున్నారు. గత రెండు చిత్రాలు నిరుత్సాహపరచడంతో ఈ సినిమా విజయాన్ని, అన్ని రకాలుగా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత వారం ప్రేక్షకుల ముందుకొచ్చి సక్సెస్‌బాటలో కొనసాగుతోంది. ఈ చిత్రం ఆయన కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ చిత్రాల జాబితాలో చేరింది. తాజాగా ప్రభాస్ ఓ హాలీవుడ్ మీడియాతో మాట్లాడారు. ఈ చిత్రం అంగీకరించడం వెనకున్న ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. సలార్ లైన్ వినగానే ఒక మెరుపులా అనిపించింది. కథ, దర్శకుడు నెరేట్ చేసిన తీరు ఎంతో నచ్చింది. అందుకే విన్న వెంటనే అంగీకరించా. ఇన్నేళ్ల నా జర్నీలో ఇదొక భిన్నమైన పాత్ర. ఛాలెంజ్‌తో కూడుకున్నది. 'బాహుబలి' నా కెరీర్‌కు ఒక బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఎంచుకున్న సినిమాలన్నీ కొత్తదనం ఉండేలా చూసుకున్నా. అందులో భాగంగానే 'సలార్'ను అంగీకరించా. నేటి ప్రేక్షకులు వైవిధ్యమైన కంటెంట్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా భారతీయ చిత్రాల గురించే చర్చించుకుంటోంది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అని కాకుండా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అని గుర్తిస్తున్నారు. రాజమౌళి, ప్రశాంత్‌నీల్ వంటి దర్శకులతో పనిచేయడం అద్భుతమైన అనుభూతి. సలార్ పార్ట్ 1 చివరిలోనే రెండో భాగం ఉంటుందని స్పష్టం చేశాం. మొదటి పార్ట్‌తో పోలిస్తే రెండో పార్ట్ మరింత అద్భుతంగా ఉంటుంది. అంచనాలకు మించి ఉంటుందని ప్రభాస్ చెప్పారు. సినిమా టీమ్ ఊహించినట్లుగా అంచనాలను అందుకుందీ చిత్రం. వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ', సందీప్‌రెడ్డి వంగా తో 'స్పిరిట్'లో నటిస్తున్నారు. మారుతిలో ఓ చిత్రంతో బిజీగా ఉన్నారు.